క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

తప్పిన పెను ప్రమాదం



బస్సును ఢీకొన్న కారు

కొమ్మాది : ఎండాడ జాతీయ రహదారి వద్ద ఆదివారం పెద్ద ప్రమాదం తప్పింది. ఎండాడ నుంచి మధురవాడవైపు వ్యతిరేక దిశలో వెళ్తున్న ఓ కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది. ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు అందుకున్న ఎర్నిమాంబ

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలో 14 గ్రామాల ఆరాధ్య దేవత శ్రీ ఎర్నిమాంబకు ఆదివారం పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు. వేకువజాము నుంచే మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా మే నెలలో అమ్మవారికి మత్స్యకార మహిళలు కలశాలతో గంగను తీసుకొచ్చి, అమ్మవారికి అభిషేకించి, అనంతరం పసుపు, కుంకుమ సమర్పిస్తారు.

11న కొత్తమ్మకు పసుపు కుంకుమ సమర్పణ



సంతపేట కొత్తమ్మతల్లి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట కొత్తమ్మతల్లికి జూన్ 11న పసుపు కుంకుమ సమర్పించడానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు తీర్మానించారు. ఆదివారం సంతపేట రామాలయంలో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశానికి రెడ్డివీధి, గొల్లవీధి, కుమ్మరివీధికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. అదే నెల 7న చిట్టివలసలోని దుర్గాలమ్మకు పసుపు కుంకుమ సమర్పించనున్నారు. ఈ మేరకు ఈ నెల 22న దండోరా వేయించనున్నారు. సంతపేట, కొత్తపేట, కొండపేట, వెలంపేట, కార్మికవాడలో ప్రజలంతా వేడుకలకు సిద్ధమవ్వాలని కోరారు.

తిమ్మాపురంలో గ్రావెల్ మాఫియా

- సొసైటీ పేరుతో అక్రమంగా తవ్వేసి అమ్మకాలు
- ఇప్పటికే కరిగిపోయిన సగం కొండ



సొసైటీ పేరుతో గ్రావెల్ తవ్వేస్తున్న కొండ ఇదే

కొమ్మాది : పచ్చని కొండలను తొలిచేస్తున్నారు. రాత్రి అయితే చాలు జేసీబీలు, లారీలతో దర్జాగా మట్టి, రాయి తరలించుకుపోతున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో కాదు... భీమిలి బీచ్ రోడ్డు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తిమ్మాపురంలో గ్రావెల్ మాఫియా యథేచ్ఛగా కొండను తొలిచేస్తోంది. రోజూ రాత్రి 11 గంటల నుంచి గ్రావెల్ అక్రమ తరలింపు ప్రారంభించి లక్షలాది రూపాయల వ్యాపారం సాగిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు స్పందించకపోవడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ పేరుతో ఓ వ్యక్తి ఈ కథ మొత్తం నడిపిస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం అంటున్నారు.

ఇదీ అసలు కథ

భీమిలి బీచ్ రోడ్డు అంటే అందమైన సాగరతీరం, ఆహ్లాదకర వాతావరణం కలగలిసిన ప్రాంతం. ఇక్కడ ఒక్క సెంట్ స్థలం ఉన్నా అదృష్టంగా భావిస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో స్థలం కొందామన్నా దొరకని పరిస్థితి. దీనిని ఆసరాగా తీసుకున్న ఓ వ్యక్తి తన సొసైటీ పేరుతో కొండను మొత్తం తొలిచేస్తున్నాడు. గ్రావెల్‌ను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ ఆ స్థలాన్ని చదును చేసుకుంటూ ప్లాట్స్‌గా విభజించి విక్రయించేస్తున్నాడు. ఎవరైనా చిన్నపాటి అధికారి వస్తే తమకు ప్రభుత్వమే సొసైటీకి స్థలం ఇచ్చిందని, దానిని చదును చేస్తున్నానని అంటాడే తప్ప ఆయన దగ్గర ఉన్న ఒక్క డాక్యుమెంట్ కూడా చూపించడు. ఏదో విధంగా ఆ అధికారిని మాటలతో మాయ చేసి పంపిచేస్తాడు. నిజంగా ప్రభుత్వమే సొసైటీకి స్థలమిస్తే ఓ రెవెన్యూ అధికారిని నియమించి ఆయన పర్యవేక్షణలో ప్లాట్లు వేసి సొసైటీ సభ్యులకు అందిస్తారు. కానీ ఇక్కడ మాత్రం ఓ వ్యక్తి కనుసన్నల్లోనే ఈ వ్యాపారం అంతా కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో, ఇతర సెలవు దినాల్లోనూ, యథేచ్ఛగా కొండను తవ్వి గ్రావెల్‌తో లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నాడు. ఇలాంటి వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోరంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారి బీచ్ రోడ్డులో ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో వారికే తెలియాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో కొండను తొలచి అనధికారికంగా గ్రావెల్ తరలింపుపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా కొండలను తవ్వడం, గ్రావెల్, రాయి తరలిస్తే ఎంతటి వారైనా క్షమించేది లేదు. ఈ గ్రావెల్ తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

– భాస్కర్‌రెడ్డి, ఆర్‌డీవో

నీట్‌లో సత్తా చాటిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

తగరపువలస : గత రెండేళ్లుగా తమ కళాశాలలో చదువుకున్న 120 మంది విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించారని, ఈ ఏడాది కూడా ప్రవేశ పరీక్ష రాసిన తమ బ్రాంచి విద్యార్థుల్లో 60 మందికి పైగా సీట్లు సాధిస్తారని ఆనందపురం మండలం పెద్దిపాలెం శ్రీభవిష్య జూనియర్ కళాశాల డైరెక్టర్ రామారావు తెలిపారు. కళాశాలలో ఆదివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో 120 మంది విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. గత ట్రాక్ రికార్డు పరిశీలిస్తే విశాఖ, విజయవాడ బ్రాంచ్‌లలో ప్రతీ నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు మెడికల్ సీట్లు సాధించారన్నారు. భవిష్యత్‌లో ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు ర్యాంకులు సాధించేలా శిక్షణ కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు జ్ఞాపికలు పంపిణీ చేశారు.

చంద్రంపాలెంలో మజ్జిగ పంపిణీ



చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ : ఎండలు మండిపోతున్న తరుణంలో మధురవాడలో పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, నీరు పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా సత్యసాయి భక్తులు, చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద తరచూ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం పీఎం పాలెం పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో సాయిప్రియ లే అవుట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మీసాల నర్సింగరావు కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులు, భక్తులు, వాహనదారులకు చల్లని మజ్జిగ పంచిపెట్టారు. కార్యక్రమంలో పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘం అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పొన్నగంటి నాగేశ్వరరావు, బేతా అప్పలకుమార్, సత్యరామస్వామి, కోడూరి శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, రాంబాబు శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సండే సంతకు పండగల ఎఫెక్ట్



ప్రైవేట్ మార్కెట్‌లో రద్దీగా మేకలు, గొర్రెల వ్యాపారం



ఫుట్‌పాత్‌పై వలలు, తాళ్ల వ్యాపారం

జోరుగా సాగిన వ్యాపారాలు

తగరపువలస : స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో ఆదివారం జరిగిన సంతలో చుట్టుపక్కల గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామదేవతల పండగల ప్రభావం కనిపించింది. ముఖ్యంగా ఈ పండగలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన గొర్రెలు, మేకలు, నాటుకోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పక్క జిల్లాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున మూగజీవాలను సంతకు తరలించారు. ఇవి కిలో రూ.వెయ్యి దాటి ధరలు పలికాయి. నాటుకోళ్లు కూడా గొర్రెలు, మేకల ధరలతో పోటీపడ్డాయి. తొలేళ్లు, రథోత్సవం, పాలధార ఉత్సవాల సమయంలో ఎక్కువగా వినియోగించే తాళ్లు, తాటి, కొబ్బరి, జనపనారతో తయారు చేసిన అలంకరణ సామగ్రి, వెదురు కర్రల విక్రయాలు ఎక్కువగా సాగాయి. ఈ నెల 20 నుంచి జీవీఎంసీ 4వ వార్డు, భీమిలి మండలం మత్స్యకార గ్రామాల్లో, తర్వాతి వారంలో చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ గ్రామాల్లో అమ్మవార్ల పండగలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఇవే కాకుండా మట్టిపాత్రలు, చీరలు, కిరాణా వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. దీంతో వ్యాపారుల్లో జోష్ నెలకొంది.



కావిడ బద్దలు, వెదురుకర్రల అమ్మకం

పెదనాగమయ్యపాలెం జట్టు విజేత



పెదనాగమయ్యపాలెం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస : భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో గత నెల 25 నుంచి ఆదివారం వరకు జరిగిన గరికిన ఎల్లయ్య మెగా టోర్నమెంట్‌లో పెదనాగమయ్యపాలెం లెవెన్స్ జట్టు పెదనాగమయ్యపాలెం పోలమాంబ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. ఇటీవల జరిగిన సెమీ ఫైనల్స్‌లో చిననాగమయ్యపాలెం జట్టుపై పెదనాగమయ్యపాలెం లెవెన్స్ గెలిచి ఫైనల్స్‌లో ప్రవేశించింది. 44 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో నిర్వాహకులు గరికిన అప్పన్న, పోలయ్య, చిన్న, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత ఆదివారం కూడా కొనసాగింది. ఈ నెల 23న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనం సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 37 కిలోల చందనాన్ని అరగదీశారు. రెండు రోజుల్లో 77 కిలోల చందనం సమకూరింది. సోమవారం కూడా చందనం అరగదీత చేపట్టనున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



కార్మికవాడలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

తగరపువలస : ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం చిట్టివలస సిటు కార్యాలయం వద్ద నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకంలోని విషయాలు గుర్తు చేశారు. కార్యక్రమంలో రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కర్రి రాము, జీరు సత్యారావు, కానూరి రమణ, ఆనంద్, సూరిబాబు, సన్యాసప్పడు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో సత్యానారాయణ స్వామి

తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేట శ్రీవిద్య శక్తిపీఠంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో పలువురు దంపతులు పాల్గొని వ్రతాలు ఆచరించారు. పూజా కార్యక్రమాల అనంతరం వారికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం



బాలుడు లోకేష్ కాలుపై గాయం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట రెడ్డివీధిలో ఆదివారం పిచ్చికుక్క ముగ్గురిని గాయపరచింది. సంతకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అంకిత రెడీమెడ్స్ సమీపంలో కూర్చుని వుండగా పిచ్చి కుక్క అక్కడకు వెళ్లి గాయపరిచింది. తర్వాత మార్కెట్ కొండవాలు ప్రాంతంలో ఉంటున్న శీరపు లోకేష్, అభి అనే చిన్నారులను తీవ్రంగా గాయపరచింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పిచ్చికుక్కను హతమార్చడంతో పాటు కుక్కల బెడదను తగ్గించాలని కోరుతున్నారు.

విద్యార్థులే లక్ష్యంగా ఆకతాయిల బ్లాక్‌మెయిల్

తగరపువలస : జీవీఎంసీ మధురవాడ జోన్ కొమ్మాది యూనియన్ బ్యాంకు పరిసరాల్లోని ఒక తోట కేంద్రంగా ఆకతాయిలు విద్యార్థులను ట్రాప్ చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పట్టపగలే అక్కడ తిష్టవేసిన ఆకతాయిలు సోషల్ మీడియా ద్వారా విద్యార్థులను ట్రాప్ చేసి రహస్య ప్రదేశాలకు తీసుకెళ్లి తాము చెప్పినట్టు చేయాలని బెదిరిస్తున్నారు. నిరాకరించిన వారికి అసభ్యంగా ఫొటోలు తీసి బెదిరిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతానికి చెందిన ఒక ఇంజినీరింగ్ చదువుకునే యువకుడిని టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆకర్షించారు.

తమతో కలిసి శారీరక సంబంధం పెట్టుకోవాలని బెదిరించగా ఆ విద్యార్థి నిరాకరించాడు. దీంతో ఆకతాయిలు విద్యార్థి ఇంటికి ఫోన్ చేసి మీ అబ్బాయి గే అంటూ హేళన చేశారు. ఈ ఫొటోలు బయట పెట్టకుండా ఉండాలంటే రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఆ బాధిత విద్యార్థి నుంచి రూ.4 వేలు కాజేశారు. దీనిపై బాధిత విద్యార్థి తరఫున బంధువులు ఆకతాయిల ఫొటోలను సేకరిస్తున్నారు. దీనిపై పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.

వైభవంగా కుంతీ మాధవ స్వామి చందనోత్సవం



చందనం అలంకరణలో కుంతీ మాధవ స్వామి



చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి చందనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 వరకు కుంతీ మాధవ స్వామికి అర్చక స్వాములు చందనంతో అలంకరించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలకంరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పించారు. వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలైన మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విలాస్కాన్‌పాలెం, కురపల్లి నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, భీమునిపట్నం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తగరపువలసలో సమావేశమైన భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తగరపువలస : భీమిలి శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 1993 – 96 బ్యాచ్ బీకాం విద్యార్థులు ఆదివారం తగరపువలసలో సమావేశమయ్యారు. 28 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న సందర్భంగా స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. ఈ విరామ కాలంలో తమ నుంచి దూరమైన స్నేహితులను తలచుకుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సమావేశంలో పొట్నూరు శ్రీనివాసరావు, వెంకట సురేష్, అనంతలక్ష్మి, నాగమణి, గంగారత్నం, జెమీమా, దుర్గా లక్ష్మి, నిర్మల, వంకాయల ఉదయ భాస్కర్, పోతిన సోంపాత్రుడు, రవికుమార్, బసిశెట్టి సతీష్, ఊడికల శ్రీనివాసరావు, బండారు శ్రీను, మాదాబత్తుల శంకర్‌కుమార్, రాహుల్‌రాయ్, ఆదినారాయణ, గంటా రాజు, మజ్జివలస శ్రీను, పీతల గంగశ్రీను, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తీరం... జనసంద్రం



కొమ్మాది: తీరంలోని పర్యాటక ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచి భానుడు భగభగలాడడంతో సాయంత్రం కాస్త ఉపశమనం కోసం బీచ్‌కు చేరుకున్నారు. వందలాది మంది పర్యాటకులు సాగర్‌నగర్ బీచ్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లో స్నానాలు చేస్తూ, ఎండ నుంచి ఉపశమనం పొందారు.

ముగిసిన ఆశ్రమ వార్షికోత్సవాలు



అన్నదానం ప్రారంభిస్తున్న యోగారాజు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో 5 రోజుల నుంచి జరుగుతున్న శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఉదయం శిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, సాయినామ పఠనం, హారతి అందజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు యోగారాజు ప్రారంభించారు. 14 సంవత్సరాల క్రితం ఇద్దరు వృద్ధులతో ప్రారంభమై నేడు 30 మందికి ఆశ్రయం కల్పించామని యోగారాజు తెలిపారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఆశ్రమంలో మానవసేవ, మాధవ సేవ, గో సేవ నిర్వహిస్తున్నామని యోగారాజు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పద్మనాభం : మండలంలోని ఆర్‌వీ పురంలో ఆదివారం నిర్మాణ్, ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. 12 నుంచి 18 ఏళ్ల లోపు వయసు గల ఆడ పిల్లలు, మహిళలకు పరీక్షలు జరిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు శాంతి, కల్యాణ్, ఆర్‌వీపురం ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వెంకటాపురం సర్పంచ్ కె.రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు మరగడ అప్పారావు, ఎం.సత్యం, నిర్మాణ్ సంస్థ మేనేజర్ సీహెచ్.శ్రీధర్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.